# గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్/ పాల్వంచ, జూన్ 25,(సాక్ష్యం)** గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలు, మౌలిక సదుపాయాలు, స్థానిక సమస్యలను గుర్తించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని,గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యచందన , జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మిగతా 2 లో...





శుక్రవారం | 26 | జూన్ | 2026 • పేజీలు : 6


# బిఎల్వోలు ,సూపర్వైజర్లు అర్హులైన ఓటర్లను గుర్తించి తప్పనిసరిగా నమోదు చేయాలి


### భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వెల్లడి



**భద్రాచలం టౌన్, జూన్ 25, (సాక్ష్యం)** ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియను సంబంధిత బిఎల్వోలు, సూపర్వైజర్లు అర్హులైన ఓటర్లను గుర్తించి తప్పనిసరిగా నమోదు చేయాలని భద్రాచెలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా భద్రాచలంలోని అశోక్ నగర్ కాలనీలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 167 పరిధిలో ఉన్న తన క్యాంపు కార్యాలయానికి ఎన్యుమరేషన్ ఫారం అందించడానికి మిగతా 2 లో...

- 27న భద్రాద్రి పునరుద్దరణ పనులకు శ్రీకారం
- రూ.351 కోట్లతో భద్రాద్రి రూపురేఖల మార్పు
- ఆగమశాస్త్ర నియమాల ప్రకారమే పనులు
- వచ్చే శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని ఆదేశం
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

2 లో..



# ఆగమబద్ధంగా... అంగరంగ వైభవంగా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సాక్ష్యం

దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరింత వైభవోపేతంగా రూపుదిద్దుకోనుంది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా, ఆగమశాస్త్ర నియమాలను పాటిస్తూ చేపట్టనున్న అభివృద్ధి, పునరుద్ధరణ పనులకు ఈ నెల 27న శ్రీకారం చుడుతున్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా, ఆధ్యాత్మిక వైభవం చెక్కుచెదరకుండా ఆలయ అభివృద్ధి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది.

- బెదిరింపుల కొరకే ఖాకీ ఉపయోగమా..? • అమాయక గిరిజనులపై అక్రమ క్రిమినల్ కేసులా..? • నిద్ర మత్తులో జిల్లా పోలీస్ బాస్..? • అగ్రకులాల చేతిలో కీలుబొమ్మలుగా అధికారులు..? • పోలీస్ శాఖ తీరు వలన నష్టపోతున్న గిరిజన కుటుంబాలు • ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన నాలుగు కేసుల ముచ్చట • భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ తీరుపై డీజీపీ దృష్టి సారించేనా..? • పోలీస్ యంత్రాంగంపై సమగ్ర విచారణ జరగాలంటున్న గిరిజన సంఘాలు • ఖాకీ ప్రతిష్ఠకు మచ్చ పడుతోందా..?

6 లో..



# దారితప్పిన పోలీస్ శాఖ..!

కొత్తగూడెం, సాక్ష్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ వ్యవస్థ పని తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన బాధితులే చివరకు కేసుల్లో ఇరుక్కుపోతున్నారనే ఆరోపణలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఒక గిరిజన కుటుంబంపై నెల రోజుల వ్యవధిలో వరుసగా నాలుగు క్రిమినల్ కేసులు నమోదవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బాధిత కుటుంబం, గిరిజన సంఘాల ఆరోపణల ప్రకారం.. ఒక అగ్రకులానికి చెందిన వ్యక్తితో 57 బాండ్ పేపర్ల వ్యవహారంలో వివాదం ప్రారంభమైందని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ప్రశ్నించినందుకే తమపై రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లు తీసుకొచ్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు ఇంటింటికీ పాలు అమ్ముకుంటూ తిరిగిన వ్యక్తి ఇప్పుడు కోట్ల రూపాయల వ్యవహారాల్లో కీలకంగా మారడం వెనుక ఉన్న కథ ఏమిటన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

# భద్రాద్రిలో వైభవంగా 'భూవరాహ మహాయాగం'

- రైతు బాగుంటేనే లోకం బాగుంటుంది: ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు
- దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలిచే అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం
- లక్ష మంది రైతులకు 32 దివ్య క్షేత్రాల 'మృత్తికా ప్రసాదం' పంపిణీ
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి పోటెత్తిన అన్నదాతలు



**భద్రాచలం కల్చరల్, జూన్ 25, (సాక్ష్యం):** భద్రాద్రి దివ్య క్షేత్రంలో అన్నదాతల శ్రేయస్సును కాంక్షిస్తూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహా యాగం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. క్షేత్రంలో కొలువై ఉన్న కల్పవృక్ష నారసింహ స్వామి వారి దివ్య సన్నిధిలో, నృసింహ ఉపాసకులు డా.కృష్ణ చైతన్య స్వామి ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక 'భూ వరాహ యజ్ఞం' శాస్త్రోక్తంగా ప్రారంభమైనది దేశ చరిత్రలోనే మిగతా 2 లో...

## భద్రాద్రిలో వైభవంగా 'భూవరాహ మహాయాగం'





(మొదటి పేజీ తరువాయి...)

రైతుల కోసం ఇంతటి భారీ స్థాయిలో యాగం నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**32 దివ్య క్షేత్రాల మట్టితో ప్రత్యేక పూజలు..**


ఈ యాగంలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 32 స్వయంభూ నృసింహ క్షేత్రాలు 9భూ వరాహ క్షేత్రాలు 108పుట్టల నుండి సేకరించిన పవిత్ర మృత్తికకు (మట్టికి) వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పవిత్ర మృత్తికా ప్రసాదాన్ని దాదాపు లక్ష మంది రైతులకు అందజేయనున్నారు. ఈ ప్రసాదాన్ని తమ పొలాల్లో చల్లుకోవడం వల్ల భూమి సుభిక్షమై పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల బలమైన నమ్మకం ఇంతటి మహత్తర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు భూవరాహయజ్ఞఫలం ప్రతి రైతుకి ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ."రైతు బాగుంటేనే ఈ లోకం బాగుంటుంది. దేశానికి వెన్నెముక అయిన రైతు శ్రేయస్సు కోసం భద్రాద్రి గడ్డపై ఇలాంటి మహాయాగం జరగడం దేశ చరిత్రలోనే ఒక మైలురాయి అని ఒక రైతు బిడ్డగా, అన్నదాతల మేలు కోరి చేసే ఈ పవిత్ర యాగంలో పాల్గొనే అవకాశం దక్కడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు నిజంగా ఈ యాగం నా చిన్ననాటి జ్ఞాపకాలను మరోసారి గుర్తుచేసింది." అని భావోద్వేగంగా పేర్కొన్నారు. యాగం ప్రారంభోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణం భక్తిభావంతో పులకించిపోయింది. సుమారు లక్ష మంది రైతులకు ఈ మృత్తికా ప్రసాదాన్ని అందించే ఈ మహత్తర కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి వేలాదిగా రైతులు తరలివచ్చారు. లోకానికి అన్నం పెట్టే రైతు బాగుండాలని ఆకాంక్షిస్తూ ఈ యాగాన్ని సంకల్పించిన డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి కృషిని రైతులు, ప్రజాప్రతినిధులు ఘనంగా అభినందించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాయాగం కోసం వచ్చే రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుతో పాటు, టిపిసీసీ జనరల్ సెక్రటరీ నాగసీతారాములు, సర్పంచ్ పూనెం కృష్ణ, పలువురు ప్రభుత్వ అధికారులు, రైతు నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఎల్వోలు ,సూపర్వైజర్లు అర్హులైన ఓటర్లను గుర్తించి తప్పనిసరిగా నమోదు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

వచ్చిన తహసీల్దారు, బిఎల్ఓ ద్వారా ఎన్యుమరేషన్ ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బి ఎల్ ఓ, సూపర్వైజర్లకు పలు సూచనలు ఇస్తూ ఎన్యుమరేషన్ ఫారంలో ఓటర్ల యొక్క వివరాలు పొందుపరిచేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటర్లను పూర్తిస్థాయిలో వివరాలు అడిగిన తర్వాతనే ఎన్యుమరేషన్ ఫారంలో పొందుపరచాలని అన్నారు. అనంతరం భద్రాచలం తహసీల్దారు, బిఎల్వోలు సూపర్వైజర్లు ఎస్ ఆర్ ఎన్ కాలనీలోని 172 పోలింగ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్ పోదెం వీరయ్య కుటుంబ సభ్యులకు ఎన్యుమరేషన్ పారములు అందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసిల్దార్ కోటా రవికుమార్, బిఎల్వోలు రాజేశ్వరి, మంగమ్మ, సూపర్వైజర్లు వరలక్ష్మి, కీర్తి పాల్గొన్నారు.

- 27న భద్రాద్రి పునరుద్ధరణ పనులకు శ్రీకారం
- రూ.351 కోట్లతో భద్రాద్రి రూపురేఖల మార్పు
- ఆగమశాస్త్ర నియమాల ప్రకారమే పనులు
- వచ్చే శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని ఆదేశం
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



## ఆగమబద్ధంగా...

# అంగరంగ వైభవంగా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సాక్ష్యం

**దక్షిణ అయోధ్యగా ఖ్యాతిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరింత వైభవోపేతంగా రూపుదిద్దుకోనుంది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా, ఆగమశాస్త్ర నియమాలను పాటిస్తూ చేపట్టనున్న అభివృద్ధి, పునరుద్ధరణ పనులకు ఈ నెల 27న శ్రీకారం చుడుతున్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా, ఆధ్యాత్మిక వైభవం చెక్కుచెదరకుండా ఆలయ అభివృద్ధి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది.**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి, పునరుద్ధరణ పనులను ఈ నెల 27వ తేదీన అధికారికంగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం దేవస్థానం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

**ఆగమశాస్త్రానికే తొలి ప్రాధాన్యం**

భక్తుల విశ్వాసాలు, ఆలయ సంప్రదాయాలను గౌరవిస్తూ ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటించే విధంగా ప్రతి పనిని చేపట్టాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఆలయ పవిత్రతకు, ఆధ్యాత్మికతకు ఎలాంటి భంగం కలగకుండా పనులు నిర్వహించాలని సూచించారు.

**రాతి నిర్మాణాలతో సంప్రదాయ వైభవం**

భద్రాచలం ఆలయ చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా సంప్రదాయ శిల్పకళకు పెద్దపీట వేయాలని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తూ, ఆలయ విశిష్టతను మరింత పెంపొందించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**భవిష్యత్ తరాలకు ఆదర్శంగా**

రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ సంప్రదాయ వైభవాన్ని పరిరక్షించేలా పనులు రూపొందించినట్లు వెల్లడించారు.

**రూ.351 కోట్లతో భద్రాద్రి రూపురేఖల మార్పు**

భద్రాచలం దేవస్థానం పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులతో చేపట్టే పనులు భక్తుల అవసరాలను తీర్చడమే కాకుండా ఆలయ వైభవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని పేర్కొన్నారు.

**శ్రీరామనవమి నాటికి లక్ష్యం**

వచ్చే శ్రీరామనవమి నాటికి నిర్దేశించిన పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ముందస్తు కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. పనుల విభజనను ముందుగానే పూర్తి చేసి, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**యుద్ధ ప్రాతిపదికన పనులు**

ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తి కావాలని, అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుడుతుండటంతో భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భక్తి, సంప్రదాయం, ఆధునిక సౌకర్యాల సమన్వయంతో భద్రాద్రి క్షేత్రం మరింత మహిమాన్వితంగా రూపుదిద్దుకోనుండటంతో భక్తుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రాబోయే తరాలకు సైతం ఆదర్శంగా నిలిచేలా ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించే ఈ మహత్తర కార్యాచరణ భద్రాద్రి చరిత్రలో మరో మైలురాయిగా నిలవనుంది.

## గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నాగలక్ష్మి, డి ఆర్ ఓ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజా అవసరాలు, ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు . ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పంచాయతీ అడ్వాన్స్ ఇండికేటర్స్ , పీఏఐ సూచికలను జీపీడీపీతో అనుసంధానం చేయడం ద్వారా నాణ్యమైన గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించే విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు, పెసా గ్రామ పంచాయతీలు, సభాసర్, నిర్ణయ్ యాప్, ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్ వినియోగంపై వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీలు ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విద్యచందన, పంచాయతీ కార్యదర్శి ఎం. సాయి, ఎంపీడీఓ సంకీర్త్, ఎంపీఓ వీరారెడ్డి, ఎంపీఓ సంధ్య శిక్షకులుగా పాల్గొని వివిధ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమం లో సంబంధిత జిల్లా అధికారులు, కొత్తగూడెం, భద్రాచలం డివిజన్ల డీఎల్పీఓలు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు , సిబ్బంది పాల్గొన్నారు.



# ఓం దత్త శ్రీ దత్త జయ జయ దత్త







- దత్త నామంతో మార్మోగిన పట్టణం
- అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ గురు దత్తాత్రేయ విగ్రహప్రతిష్ట
- కనులపండుగలా అనఘాదేవి కళ్యాణం
- పూజలు, అన్నదానానికి వేలాదిగా హాజరైన భక్తులు

**అశ్వారావుపేట, జూన్ 25, సాక్ష్యం :** నియోజకవర్గ కేంద్రం లోని జంగారెడ్డిగూడెం రోడ్డులో కొలువుతీరి ఉన్న శ్రీ జ్ఞాన సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శ్రీ గురు దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలతో పట్టణం మొత్తం దత్తనామ స్మరణతో మార్మోగింది. వేద పండితులు శ్రీ వేలూరి సురేష్ శర్మ (గురూజీ) ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా, వైదికోక్తంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ గురు దత్తాత్రేయ స్వామి వారి భవ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులందరూ పరవశించిపోయేలా స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత కన్నులపండుగగా నిర్వహించారు. ఈ వేడుకను కళ్లారా వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజ లు, హోమాలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన వేలాది మంది భక్తుల కు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం (మహాప్రసాద వితరణ) చేపట్టారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాం గణం భక్తజనసందోహంగా మారింది. పట్టణంలో పూర్తి ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డీ సా యి సేవ సమితి అధ్యక్షులు పంబి హరిబాబు, కార్యదర్శి మంగదొడ్డి మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు కేత ధనరాజు, ముళ్ళపూడి సూరిబాబు, విమలా శ్రీదేవి తిరుమలశెట్టి అప్పారావు, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, కన్నెబోయిన రమాదేవి, పృథ్వి, రాజేందర్, ఆనంద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం



**లక్ష్మీదేవిపల్లి, జూన్ 25 ( సాక్ష్యం )** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) లక్ష్మీదేవిపల్లి మండలంలో గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూణెం శ్రీనివాస్, ప్రశాంతినగర్ సర్పంచ్ అజ్మీరా లైలా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎం.డి. గౌస్ పాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పనిచేసి ఓటర్ల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా రద్దు కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు పాయం వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, తాటి వరప్రసాద్, ఫహీమ్ పాషా, ఘంటసాల దుర్గారావు, దంచలపూడి సరిత, చిన్న, సలీం భాయ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## రామతులశమ్మ మృతి పట్ల సాబీర్ పాషా సంతాపం



**లక్ష్మీదేవిపల్లి జూన్ 25 ( సాక్ష్యం )** ప్రముఖ విద్యావేత్త, త్రివేణి–కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు తల్లి మాచవరపు రామతులశమ్మ మృతి పట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడిని విద్యావేత్తగా తీర్చిదిద్దడంలో రామతులశమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆమె ప్రోత్సాహంతో ఏజెన్సీ ప్రాంతంలో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించే అవకాశం పొందారని పేర్కొన్నారు. ఆమె మరణం కుటుంబ సభ్యులతో పాటు విద్యారంగానికి తీరని లోటని అన్నారు. రామతులశమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పారదర్శక ఓటర్ జాబితా కోసం ప్రత్యేక సమగ్ర సవరణ

- భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట



**భద్రాచలం టౌన్ , జూన్ 25 , సాక్ష్యం** పారదర్శక ఓటర్ జాబితా కోసం ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో సంబంధిత ఓటర్లు బి ఎల్ ఓ లు అందించిన ఎన్యుమరేషన్ పారాలలో పూర్తి స్థాయి వివరాలు పొందుపరిచి తిరిగి బిఎల్ఓ లకు అందించి రసీదు పొందాలని భద్రాచలం సబ్ కలెక్టర్, భద్రాచలం నియోజక వర్గం ఈఆర్ఓ మృనాల్ శ్రేష్ట ఓటర్లకు సూచించారు. గురువారం భద్రాచలంలోని అయ్యప్ప కాలనీలోని 158వ పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లకు ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు అందించి ఓటర్లకు సూచనలు, సలహాలు ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఈరోజు నుండి ప్రారంభమైనందన్నారు. బిఎల్ఓ, బిఎల్ఏలు వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు అందించినప్పుడు తప్పనిసరిగా సంబంధిత ఇంటి యజమాని కుటుంబ సభ్యుల వివరాలు, అర్హులైన వారికి ఓటర్ నమోదు చేయించాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారం పూరించేటప్పుడు ఓటర్లు తప్పనిసరిగా ఓటర్ ఐడి కార్డ్, ఆధార్ కార్డ్, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా తెలిసి ఉండాలని, బిఎల్వోలు అవసరమైతే అడిగే పత్రాలు జనన ధ్రువీకరణ పత్రం, చదువుకున్న వారు పదవ తరగతి మెమో, పాస్పోర్ట్ , డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, విద్యుత్ బిల్లు లేదా గ్యాస్ బిల్లు, బ్యాంకు పాస్బుక్, ఇంటి లేదా భూమి పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగి ఐడి లేదా పెన్షన్ పేమెంట్ ఆర్డర్ అందించి మీ పేరు, తల్లిదండ్రుల పేరు, వయసు చిరునామా సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని, కుటుంబంలోని అందరి సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించు కొని సక్రమంగా పూరించి తిరిగి బిఎల్ఓ లకి అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహసిల్దార్ శ్రీమతి వినయ్ శీల శ్రీరామ్, బిఎల్ఓ రమేష్, సూపర్వైజర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీని దేశ ప్రజలు మర్చిపోలేరు

### బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**కొత్తగూడెం, జూన్ 25 ( సాక్ష్యం )** పీడకల లాంటి ఎమర్జెన్సీ కాలాన్ని దేశ ప్రజలు ఇంకా మర్చిపోలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమర్జెన్సీ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వర్గీయ ఇందిరాగాంధీ తన ప్రధానమంత్రి పదవిని కాపాడుకునేందుకే ఎమర్జెన్సీ విధించారని ఆరోపించారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించిన ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైళ్లలో నిర్బంధించారని అన్నారు. పత్రికలు, మీడియాపై కూడా ఆంక్షలు విధించి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని విమర్శించారు. నాడు జైలు శిక్ష అనుభవించిన పలువురు మాట్లాడుతూ అలహాబాద్ హైకోర్టు తీర్పు అనంతరం ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో అనేక అరాచకాలు జరిగాయని, ప్రజాస్వామ్య హక్కులు కాలరాయబడ్డాయని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో పలుమార్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఎమర్జెన్సీ కాలం నాటి సంఘటనలను ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోడియం బాలరాజు, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ జటోత్ వెంకన్న, భోగి కృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోట్టుపుల్ల శ్రీనివాసరావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, గిరిజన మోర్చా అధ్యక్షురాలు భూక్య స్వాతి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. రహమతుల్లా, గమలాపురం సత్యనారాయణ, ఆదిముల్లా రాములు, పద్మ, ఎనుముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రామాంజనేయ కాలనీలో ఓటరు ధృవీకరణ కార్యక్రమం

**కొత్తగూడెం , జూన్ 25 ( సాక్ష్యం )** రామాంజనేయ కాలనీ పంచాయతీ పరిధిలోని 193, 194 పోలింగ్ బూత్‌లలో గురువారం ఓటరు జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)తో కలిసి బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ), మాజీ ఉపసర్పంచ్ పాలెపు దుర్గేష్, బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ కో–ఆప్షన్ సభ్యురాలు పాలెపు లావణ్య ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను ధృవీకరించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, సవరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొని తమ వివరాలను అందించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి అర్హ పౌరుడు ఓటరుగా నమోదు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.



## దళిత కాలనీ వద్ద డ్రెయిన్ నిర్మించాలి
### తాండ్ర వెంకటేశ్వర్లు



**లక్ష్మీదేవి పల్లి , జూన్ 25 ( సాక్ష్యం )** రేగళ్ల గ్రామంలోని దళిత కాలనీ వద్ద డ్రెయిన్ నిర్మాణంలో వివక్ష చూపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జోన్ ఇన్‌చార్జి తాండ్ర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రేగళ్ల గ్రామాన్ని సందర్శించారు. కరకవాగు నుంచి రేగళ్ల వరకు రోడ్డు, కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ దళిత కాలనీ వద్దకు వచ్చేసరికి డ్రెయిన్ నిర్మాణాన్ని నిలిపివేసి వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి దళిత కాలనీ వద్ద డ్రెయిన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. లేనిపక్షంలో కాలనీ ప్రజల తరపున బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎం. రవి, ప్రధాన కార్యదర్శి జిల్లాల పూర్ణచందర్, శ్రీను, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

- స్వామి వారిని దర్శించుకున్న గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్





**భద్రాచలం టౌన్, జూన్ 25 సాక్ష్యం** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే స్వామి వారిని గిరిజన సంక్షేమ శాఖ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, రాంబాబు, అర్చక స్వాములు పాల్గొన్నారు.

# భద్రాచలంలో 'పల్లవి కిడ్స్' ను ప్రారంభించిన ఎమ్మెల్యే

- ఘనంగా నూతన పాఠశాల ప్రారంభోత్సవం
- విద్యా ప్రమాణాలే పునాది కావాలి: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు





**భద్రాచలం, జూన్ 25 , సాక్ష్యం** భద్రాచలం పట్టణంలో విద్యారంగంలో కొత్త అధ్యాయానికి తెరలేచింది. జిసిసి రోడ్డులోని దేవరాజ్ హాస్పిటల్ సమీపంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన 'పల్లవి కిడ్స్ స్కూల్' గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, భద్రాచలం దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు.

**››› విద్యే సమాజ నిర్మాణానికి పునాది...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, బాల్య దశలో అందించే నాణ్యమైన విద్యే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందన్నారు. కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా, చిన్నారులలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించేలా విద్యాసంస్థలు కృషి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని, క్రీడలు, కళా రంగాల్లోనూ వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

**››› విలువల కూడిన విద్య అవసరం...**

సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల చిన్నారులకు సంస్కారం, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే పిల్లల్లో నైతిక విలువలు, ఆధ్యాత్మిక చింతన, దేశభక్తిని పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

**››› అత్యాధునిక సదుపాయాల పరిశీలన...**

ప్రారంభోత్సవం అనంతరం అతిథులు పాఠశాల తరగతి గదులు, స్మార్ట్ లెర్నింగ్ సదుపాయాలు, సృజనాత్మక అభ్యాస కేంద్రాలను పరిశీలించారు. పాఠశాల యాజమాన్యం రూపొందించిన బోధనా విధానాలు, విద్యా ప్రణాళికలను చూసి వారు సంతృప్తి వ్యక్తం చేశారు. యాజమాన్యం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల మేధో వికాసానికి ఎంతగానో దోహదపడతాయని విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం వీరరాపు వెంకట సంపూర్ణ రావు బొప్పిడి పూజ, కవిటాపు రమేష్ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. చివరగా అతిథులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

## మండలంలో మొదలైన "సార్"

- ఇంటింటికి వెళ్లి ఓటర్ ల వివరాలను ధ్రువీకరిస్తున్న బిఎల్ఓ లు
- ఊట్లపల్లిలో పర్యవేక్షించిన తహసిల్దార్ కిషోర్



**అశ్వారావుపేట, జూన్ 25, సాక్ష్యం :** వాటర్ జాబితాను తప్పులు లేకుండా రూపొందించడమే లక్ష్యంగా సార్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తహసిల్దార్ కిషోర్ అన్నారు. మండలంలోని ఊట్లపల్లిలో ప్రారంభమైన 'సార్' కార్యక్రమాన్ని బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తున్నారని, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాలను పరిశీలిస్తూ అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులపై సమాచారం సేకరిస్తున్నారన్నారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పని చేసి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ప్రజలు కూడా తమ వివరాలను సక్రమంగా అందించి ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం గోదావరి నదిలో విజయవాడ యువకుడి మృతి



**భద్రాచలం టౌన్, జూన్ 25, సాక్ష్యం:** భద్రాచలంలోని గోదావరి నదిలో గురువారం విజయవాడకు చెందిన సాయి జ్ఞానేష్ అనే యువకుడు మృతి చెందాడు. తొలుత ఉదయం సమయంలో గుర్తు తెలియని మృతదేహం కనిపించినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలంకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆ మృతదేహం సాయి జ్ఞానేష్‌దేనని నిర్ధారించారు. కాగా సాయి జ్ఞానేష్ విజయవాడలో డిగ్రీ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. తండ్రి భాస్కర్ విజయవాడ పోలీసు విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. సాయి ఈ నెల 22న హాస్టల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లకుండా బస్సు ఎక్కి భద్రాచలం చేరుకున్నాడు. సాయి గురించి విజయవాడలో వెతికినా కుటుంబ సభ్యులకు ఆచూకీ లభించలేదు. అనంతరం బస్టాండు సీసీ కెమెరాల్లో భద్రాచలం బస్సు ఎక్కినట్లు గుర్తించి భద్రాచలంలో భాస్కర్ సమీప బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు మూడు రోజులుగా గాలిస్తుండగా గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. కాగా కుటుంబ సభ్యులు భద్రాచలంలోనే సాయి జ్ఞానేష్ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేసారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు పాల్గొనాలి
### తోట దేవి ప్రసన్న




**కొత్తగూడెం, జూన్ 25 ( సాక్ష్యం )** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఓటరు పాల్గొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు ప్రజలకు అండగా నిలిచి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా కృషి చేయాలని ఆమె కోరారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్ ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాల పరిశీలన, ధృవీకరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# ఐదు దశాబ్దాలుగా అక్షరార్చన...

- సంస్కృత సేవలో అలుపెరుగని యాత్ర
- భద్రాద్రి గర్వించే సంస్కృత గురువు
- వేలాది మంది శిష్యులకు జ్ఞానదీపం
- సంస్కృతమే శ్వాసగా సాగిన జీవితయానం
- భాషా సేవలో తరగని తపన
- గురువు పేరు శ్రీమన్నారాయణాచార్యులు... శిష్యులకు మాత్రం 'సంస్కృత గురువు గారు'

**సంస్కృతం ఆయనకు కేవలం ఒక భాష కాదు... జీవిత సాధన. బోధన ఆయనకు ఉద్యోగం కాదు... యజ్ఞం. ఐదు దశాబ్దాలుగా సంస్కృత భాషా పరిరక్షణ, ప్రచారం, బోధనలో నిరంతర తపనతో కృషి చేస్తూ వేలాది మంది విద్యార్థులకు జ్ఞానాన్ని పంచిన ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు నేటికీ అదే ఉత్సాహంతో భాషా సేవను కొనసాగిస్తున్నారు. శిష్యలోకంలో "సంస్కృత గురువు గారు"గా ప్రసిద్ధి చెందిన ఆయన, భద్రాచలం ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి తనదైన ముద్ర వేశారు. సంస్కృత భాషా సేవలో ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేస్తున్న ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యుల విశిష్ట ప్రస్థానంపై 'సాక్ష్యం' ప్రత్యేక కథనం.**







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 25, సాక్ష్యం :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు,వేదాలు శాస్త్రాలకు మూలాధారమైన సంస్కృత భాషను జీవితాంతం సేవించడమే తన ధ్యేయంగా మలుచుకున్న మహనీయుడు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు. భాషా బోధన, ఆధ్యాత్మిక సేవ, శాస్త్రాధ్యయనం, శిష్యులను తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి భద్రాద్రి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

### ››› పండిత వంశంలో పుట్టి... పాండిత్యానికి ప్రతిరూపంగా

పండిత కుటుంబంలో జన్మించిన శ్రీమన్నారాయణాచార్యులు చిన్ననాటి నుంచే సంస్కృత భాష, వేదశాస్త్రాల అధ్యయనంలో నిమగ్నమయ్యారు. తన తండ్రి వద్ద విద్యను అభ్యసించి వ్యాకరణం, అలంకార శాస్త్రం, మీమాంస, ఆగమశాస్త్రం, జ్యోతిష్యం తదితర శాస్త్రాల్లో విశేష ప్రావీణ్యం సంపాదించారు. అనంతరం సంస్కృత భాషా బోధనను తన జీవిత ధ్యేయంగా ఎంచుకుని తరతరాలకు జ్ఞానాన్ని పంచే గురువుగా ఎదిగారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సంస్కృత పండితుడిగా సేవలందిస్తూ అనేక తరాల విద్యార్థులకు సంస్కృత భాషను బోధించారు. ఆయన వద్ద విద్యనభ్యసించిన శిష్యులు నేడు దేశ విదేశాల్లో ప్రొఫెసర్లు, పరిశోధకులు, వేద పండితులు, కళాశాల అధ్యాపకులు, పంచాంగకర్తలుగా సేవలందిస్తున్నారు. దేవస్థానంలోని అధిక సంఖ్యలో అర్చకులు, వేదపండితులు కూడా ఆయన శిష్యులే కావడం విశేషం.

### ››› విద్యార్థుల భవిష్యత్తే తన సంపద

సంస్కృతం నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెనుకబడకూడదనే ఉద్దేశంతో అనేక మందికి పరీక్ష ఫీజులు చెల్లించారు. కొందరు విద్యార్థులకు తెలియకుండానే వారి పరీక్ష రుసుములు చెల్లించి పరీక్షలు రాసే అవకాశం కల్పించారు. అవసరమైన గ్రంథాలను సొంత ఖర్చుతో కొనుగోలు చేసి అందించారు. వేలాది పుస్తకాలను పంపిణీ చేసి జ్ఞానదానాన్ని మహాదానంగా చాటిచెప్పారు. శ్రీమన్నారాయణాచార్యులు అనే పేరుకంటే "సంస్కృత గురువుగారు" అనే పేరుతోనే ఎక్కువ మంది గుర్తిస్తారు. సంస్కృత భాషను సరళంగా, ఆసక్తికరంగా బోధించే ఆయన శైలి శిష్యుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

### ››› ఆధ్యాత్మిక ఉత్సవాలకు ఆకాశవాణి స్వరం

భద్రాచలం దేవస్థానంలో జరిగే శ్రీరామనవమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రధాన ఉత్సవాలకు నాలుగు దశాబ్దాలకుపైగా ఆకాశవాణి వ్యాఖ్యాతగా సేవలందిస్తున్నారు. దేవస్థానం ఉద్యోగుల్లో తొలి వ్యాఖ్యాతగా గుర్తింపు పొందిన ఆయన స్వరం భక్తులకు ఎంతో సుపరిచితం. ఉత్సవాల విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను భక్తులకు చేరవేయడంలో ఆయన పాత్ర విశేషమైనది. అంతేకాకుండా ఆలయ ఉత్సవాల ఆహ్వాన పత్రికలకు ఆధ్యాత్మిక విశేషాలను అందించడం, ప్రత్యేక పూజా కార్యక్రమాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం వంటి అనేక సేవలను ఆయన అందించారు. 1987లో నిర్వహించిన మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి ముహూర్తం నిర్ణయించడంలో కూడా కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా శ్రీ లక్ష్మీ మహిళా సేవా సమితిని స్థాపించి దేవాలయానికి బంగారు లక్ష్మీదేవి ప్రతిమను అందించారు. ఫాల్గుణ మాసంలో వచ్చే ఉత్తరా నక్షత్రం నాడు పూజలు పొందుతున్నదా బంగారు ప్రతిమ.

### ››› అందుకున్న బిరుదులు... గుర్తించిన ప్రపంచం

సంస్కృత భాష, శాస్త్రాలపై ఆయనకున్న అపార పాండిత్యాన్ని గుర్తించి "శాస్త్ర రత్నాకర", "పండితరాజ", "విద్వద్ వరేణ్య" వంటి ప్రతిష్ఠాత్మక బిరుదులను ప్రదానం చేశారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఢిల్లీ ,రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతి, శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం న్యూఢిల్లీ అనే ఈ మూడు విశ్వవిద్యాలయాల వారు భారతదేశంలో సంస్కృత భాషకి సేవలను అందించిన 12 మందిని ఎంపిక చేయక అందులో మన శ్రీమన్నారాయణ ఆచార్యులు గారు ఉండటం విశేషం. ఆ విశ్వవిద్యాలయాల వారు ప్రాచ్యవిద్యావిభూషణం అనే ప్రతిష్టాత్మకమైన బిరుదును ప్రదానం చేయడం భద్రాద్రి వాసులు గర్వించదగ్గ విషయం. అదేవిధంగా యునెస్కో నుంచి ప్రశంసాపత్రం అందుకోవడం ఆయన సేవలకు అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది. అనేక సాంస్కృతిక, ఆధ్యాత్మిక, విద్యాసంస్థలు ఆయనను ఘనంగా సత్కరించాయి. దేవాదాయ శాఖ, శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, సంస్కృత భాషా ప్రచార సంస్థలు నిర్వహించే వివిధ శాస్త్ర పరీక్షలకు పరీక్షాధికారిగా బాధ్యతలు నిర్వర్తించి తన అనుభవాన్ని సమాజానికి అందించారు.

### ››› తరగని తపన... కొనసాగుతున్న భాషా యజ్ఞం

వయసు పెరిగినా సంస్కృత భాష పట్ల ఉన్న ప్రేమ, సేవా తపన ఏమాత్రం తగ్గలేదు. నేటికీ ప్రత్యక్ష తరగతులతో పాటు ఆన్‌లైన్ వేదికల ద్వారా కూడా సంస్కృతాన్ని బోధిస్తూ యువతలో భాషా పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకుంటూ సంస్కృతాన్ని కొత్త తరాలకు చేరవేస్తున్నారు. సంస్కృత భాషను కేవలం బోధించడం మాత్రమే కాదు... ఒక సంస్కృతిని, ఒక సంప్రదాయాన్ని, ఒక విలువల ప్రపంచాన్ని తరతరాలకు అందించిన మహనీయుడు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు. భద్రాద్రి నేలపై ఆయన వెలిగించిన జ్ఞానదీపం భావితరాలకు మార్గదర్శకంగా నిలవనుంది.





● బెదిరింపుల కొరకే ఖాకీ ఉపయోగమా..? ● అమాయక గిరిజనులపై అక్రమ క్రిమినల్ కేసులా..? ● నిద్ర మత్తులో జిల్లా పోలీస్ బాస్..? ● అగ్రకులాల చేతిలో కీలుబొమ్మలుగా అధికారులు..? ● పోలీస్ శాఖ తీరు వలన నష్టపోతున్న గిరిజన కుటుంబాలు ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన నాలుగు కేసుల ముచ్చట ● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ తీరుపై డీజీపీ దృష్టి సారించేనా..? ● పోలీస్ యంత్రాంగంపై సమగ్ర విచారణ జరగాలంటున్న గిరిజన సంఘాలు ● ఖాకీ ప్రతిష్ఠకు మచ్చ పడుతోందా..?

# దారితప్పిన పోలీస్ శాఖ..!



కొత్తగూడెం, సాక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ వ్యవస్థ పని తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన బాధితులే చివరకు కేసుల్లో ఇరుక్కుపోతున్నారనే ఆరోపణలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఒక గిరిజన కుటుంబంపై నెల రోజుల వ్యవధిలో వరుసగా నాలుగు క్రిమినల్ కేసులు నమోదవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బాధిత కుటుంబం, గిరిజన సంఘాల ఆరోపణల ప్రకారం.. ఒక అగ్రకులానికి చెందిన వ్యక్తితో 57 బాండ్ పేపర్ల వ్యవహారంలో వివాదం ప్రారంభమైందని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ప్రశ్నించినందుకే తమపై రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లు తీసుకొచ్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు ఇంటింటికీ పాలు అమ్ముకుంటూ తిరిగిన వ్యక్తి ఇప్పుడు కోట్ల రూపాయల వ్యవహారాల్లో కీలకంగా మారడం వెనుక ఉన్న కథ ఏమిటన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.**

గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని భూముల కొనుగోలు, విక్రయాల ద్వారా భారీగా లాభాలు పొందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో ఒక ఆదివాసీ మహిళ పేరుతో కూడిన బాండ్ పేపర్లు సేకరించి మోసాలకు పాల్పడే ప్రయత్నం చేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా తెలంగాణ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ నుంచి సేకరించిన వివరాల ప్రకారం, 22-09-2018న కొత్తగూడెంలోని స్టాంప్ విక్రేతలు మహమ్మద్ ఎజాజ్ అహ్మద్, కోట శ్రీనివాసరావుల వద్ద నుంచి సుమారు 57 బాండ్ పేపర్లు కొనుగోలు చేసి చలామణి చేసినట్లు రికార్డులు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై అగ్రకుల నేతను ప్రశ్నించిన నాటి నుంచి తమ కుటుంబంపై వేధింపులు మొదలయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. దాడులు, బెదిరింపులు, ఒత్తిళ్లు, తప్పుడు ప్రచారాలు, చివరకు పోలీస్ కేసుల వరకు వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› గిరిజనుల మధ్యే చిచ్చు పెట్టే కుట్ర..?


బాధితుల వాదన ప్రకారం.. కొంత మంది గిరిజన కులస్థులను బినామీలుగా ఏర్పార్చుకొని మొదట గిరిజనులను గిరిజనులతోనే తలపడేలా చేసి ఎస్టీ వర్సెస్ ఎస్టీ ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరిగాయని తెలుస్తోంది. ఆ ప్రయత్నం విఫలమైన తరువాత పోలీస్ వ్యవస్థను రంగంలోకి దింపి కేసుల రాజకీయానికి తెరలేపారని ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదులను పరిగణలోకి తీసుకోకుండా ప్రత్యర్థుల ఫిర్యాదులకే ప్రాధాన్యం ఇచ్చారని తమ వద్ద ఉన్న ఆధారాలను పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

### ››› ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన నాలుగు కేసుల ముచ్చట

ఎటువంటి నిర్మాణం చోటుచేసుకోని స్థలాన్ని ఆధారంగా చూపిస్తూ ఆస్తి, ఇంటి నిర్మాణం ధ్వంసం చేశారనే ఆరోపణలతో ఒకే కుటుంబంపై నాలుగు క్రిమినల్ కేసులు నమోదు కావడం జిల్లాలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు స్థలపరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, ఇరు వర్గాల వాదనలు నమోదు చేయడం వంటి ప్రక్రియలు ఉండాల్సి ఉంటుంది. కానీ బాధితుల ఆరోపణల ప్రకారం..ఈ కేసుల్లో అలాంటి సమగ్ర విచారణ జరగకుండానే ఒక వైపుగా మద్దతు తెలుపుతూ ముందస్తు నిర్ణయంతో కేసులు నమోదు చేసినట్లు కనిపిస్తోందని గిరిజన సంఘాలు పేర్కొంటున్నాయి. ఆదివాసీ కుటుంబంపై నిర్మాణాలు ధ్వంసం చేసారని అబద్ధపు సాక్ష్యాలతో ఒక నెల వ్యవధిలో నాలుగు కేసులు నమోదు కావడం అదే సమయంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై పురోగతి కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. ఎటువంటి నిర్మాణం లేకపోయినా నిర్మాణం ఉందని జరగని సంఘటనలు జరిగినట్లుగా చూపిస్తూ కొందరి అబద్ధపు స్టేట్‌మెంట్ల ఆధారంగా కేసులు నమోదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ››› ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకోండి అంట..!

ఆరోపణలతో కొంతమంది ఫిర్యాదు మేరకు 5, 11, 4, 6 ప్లాట్ల నంబర్లలోని స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు లేకపోయినా నిర్మాణాలు ఉన్నాయని పేర్కొంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొంతమంది అబద్ధపు సాక్ష్యాలతో పోలీస్ దర్యాప్తులో భాగంగా స్థల పరిశీలన లేకుండానే క్రిమినల్ కేసులు నమోదు చేశారని స్థానిక గత పోలీస్ శాఖను ప్రశ్నించిన ఆదివాసీ కుటుంబానికి బెదిరింపులే వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అబద్ధపు కేసులు పెట్టొద్దు సార్ వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలని ప్రాధేయపడితే ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకోండి అంటూ బాధితులపై కొంత మంది అధికారులు దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు చేస్తున్నారు. గత పోలీస్ అధికారుల ముందు తమ బాధ చెప్పుకునే అవకాశమే ఇవ్వడం లేదని ఆదివాసీ కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఆదివాసీ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టే అగ్రకుల నేతను కాపాడేందుకు అనుకూల సాక్ష్యాలను తీసుకుంటున్నారని అంతేకాకుండా స్టాంప్ వెండర్ల వద్ద కూడా ఆదివాసీ కుటుంబానికి వ్యతిరేకంగా




స్టేట్‌మెంట్లు తీసుకోవడం పోలీస్ శాఖ అధికారుల తీరుకు నిదర్శనమని విమర్శిస్తున్నారు. బాండ్ పేపర్లు మల్లు జ్యోతి బాస్ వద్దనే ఉన్నట్లు అనేక ఆధారాలు కళ్లముందు కనిపిస్తున్నప్పటికీ ఆ విషయాన్ని కప్పిపుచ్చి ఆదివాసీ కుటుంబాన్ని తప్పుగా చూపించే పనిలో కొత్తగూడెం పోలీస్ శాఖ ఉందని ఆరోపిస్తున్నారు.

### ››› ఖాకీ ప్రతిష్ఠకు మచ్చ పడుతోందా..?

ప్రజలకు రక్షణ కల్పించి, బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీస్ శాఖపై ప్రస్తుతం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఆదివాసీ కుటుంబం చేస్తున్న ఫిర్యాదులను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తుండగా మరోవైపు అదే కుటుంబంపై వరుసగా క్రిమినల్ కేసులు నమోదు కావడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. బాధితులు చూపిస్తున్న ఆధారాలను పక్కన పెట్టి ప్రత్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడం పోలీస్ శాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వారే చివరకు కేసుల్లో చిక్కుకుని కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. డబ్బు, అధికారం, కుల ప్రభావం ముందు చట్టం బలహీనపడిందా..? లేక గత అధికారుల వ్యవహారశైలి కారణంగా మొత్తం పోలీస్ శాఖ పేరుకు మచ్చ వస్తోందా..? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. బాధితుల ఫిర్యాదులను బలహీనపరుస్తూ వారిపైనే అబద్ధపు సాక్ష్యాలతో కేసులు నమోదు చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది గత అధికారుల చర్యల కారణంగా మొత్తం ఖాకీ వ్యవస్థనే ప్రజలు అనుమానంతో చూసే పరిస్థితి ఏర్పడుతోందని సామాజిక వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి వస్తేనే ఖాకీ ప్రతిష్ఠపై పడిన మచ్చ తొలగుతుందని గిరిజన సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

### నిద్ర మత్తులో జిల్లా పోలీస్ బాస్..!

తమపై తప్పుడు కేసులు పెడుతున్నారని వేధింపులు జరుగుతున్నాయని జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. స్థానికంగా గత పోలీస్ అధికారులను ఆశ్రయించినప్పుడు కూడా ఏదైనా ఉంటే కోర్టులో తేల్చుకోండి అనే సమాధానమే వస్తోందని బాధితులు వాపోతున్నారు. అయితే పలు ప్రశ్నలు మాత్రం అలాగే మిగిలిపోతున్నాయి. కేసులు నిజమైతే కోర్టులో తేల్చుకోమని చెప్పే అధికారులను బాధితులు ప్రశ్నిస్తున్నారు. నాలుగు క్రిమినల్ కేసులు అబద్ధమైతే కేసులు నమోదు చేసిన గత అధికారులు పూర్తి బాధ్యత వహిస్తారా..? బాధితుల ఫిర్యాదులను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదు..? ఒకే కుటుంబంపై వరుసగా నాలుగు కేసులు నమోదయ్యేంత వరకు జిల్లా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు ..? అనే వాటికి సమాధానాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

### ››› డీజీపీ జోక్యం చేసుకోవాలంటున్న గిరిజన సంఘాలు

ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీ, గిరిజన సంక్షేమ శాఖ, మానవ హక్కుల కమిషన్, ఎస్సీ-ఎస్టీ కమిషన్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కేసుల నమోదు ప్రక్రియ, ఫిర్యాదుల స్వీకరణ, దర్యాప్తు విధానం, అధికారుల పాత్ర, రాజకీయ ప్రభావం తదితర అంశాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడుతున్నాయి. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆదివాసీ కుటుంబం చివరకు పోలీస్ కేసుల మధ్య నలిగిపోవడం నిజంగా ఆందోళన కలిగించే అంశమే. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉందో తేలాల్సి ఉంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది...భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనుల న్యాయ భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ఇప్పుడు జిల్లా పోలీస్ యంత్రాంగమేనని ప్రజాసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

## నాయకులగూడెంలో ఎస్ ఐఆర్ సర్వే



**సుజాతనగర్ , జూన్ 25 ( సాక్ష్యం )** కొత్తగూడెం కార్పొరేషన్ 21వ డివిజన్ పరిధిలోని నాయకులగూడెం బూత్ నంబర్ 241లో గురువారం ఇంటింటి ఎస్ ఐఆర్ సర్వే నిర్వహించారు. సుజాతనగర్ మండల అధికారులతో కలిసి వివిధ రాజకీయ పార్టీల నాయకులు సర్వేలో పాల్గొని ఓటర్ల వివరాలను పరిశీలించారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, కొత్తగూడెం డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, బీఆర్ ఎస్ నాయకుడు చల్ది రవి, సీపీఎం నాయకుడు చింతల శ్రీను, సీపీఐ నాయకులు దండు నాగేశ్వరరావు, గొలుసుల నరసింహారావు, ఓడుగు నరసింహారావు, సట్టు ఆదినారాయణ, మండే కొండయ్య, లింగం లక్ష్మయ్య, గుగులోత్ కోటేష్, ఓడుగు శ్రీను, వార్డు ఆఫీసర్ రవి పాల్గొన్నారు.